నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
26 జులై 2024
పేజీలు: 02

## పెరిగిన భక్తుల రద్దీ



తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారి సర్వదర్శనానికి 18గంటల సమయం పడుతోంది. నిన్న 61,699మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా రూ. 3.55 కోట్ల ఆదాయం హుండీ ద్వారా వచ్చిందని అధికారులు తెలిపారు. వీకెండ్ కావడంతో వచ్చే రెండు రోజులు కూడా రద్దీ ఉంటుందని అంచనా వేస్తున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎప్పటికప్పుడు తాగునీరు, ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు.

## బైడెన్ ప్రసంగాన్ని వీక్షించిన డొనాల్డ్ ట్రంప్



అమెరికా అధ్యక్ష రేసు నుంచి వైదొలిగిన తర్వాత బైడెన్ తొలిసారి ఓవల్ ఆఫీసు నుంచి ప్రసంగించిన విషయం తెలిసిందే. అయితే, ఈ ప్రసంగాన్ని యూఎస్ మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ వీక్షించిన ఫొటో సోషల్ మీడియాలో వైరలవుతోంది. నార్త్ కరోలినాలో జరిగిన ర్యాలీ తర్వాత ట్రంప్ విమానంలో ప్రయాణిస్తూ అధ్యక్షుడు బైడెన్ ప్రసంగాన్ని వీక్షించారు.





## ఆ ఒక్కటి జరిగితే అందరూ బీఎస్ఎన్ఎల్‌లోకే

జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా రీఛార్జ్ ధరలు పెంచడంతో అందరి చూపు డేటా ప్రైవసీ, ప్లాన్ల ధరలు తక్కువున్న బీఎస్ఎన్ఎల్‌పై పడింది. అయితే ప్రైవేటు కంపెనీలు 5జీ సేవలు అందిస్తుంటే బీఎస్ఎన్ఎల్ మాత్రం 4జీ సేవలు అందించేందుకే తంటాలు పడుతోంది. కేంద్రం బడ్జెట్‌లో ఈ సంస్థ కోసం రూ.82,916కోట్లు కేటాయించింది. కేంద్రం ఇలాగే బీఎస్ఎన్ఎల్‌కు అండగా ఉండి 5జీ తీసుకొస్తే ఆ నెట్‌వర్క్‌లోకి వెళ్లేందుకు యూజర్లు సిద్ధమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**TODAY MOVIE REVIEWS**

## రాయన్ రివ్యూ

కోలీవుడ్ వెర్సటైల్ హీరో ధనుష్ హీరోగా తన కెరీర్ బెంచ్ మార్క్ సినిమా 50వ సినిమాగా చేసిన చిత్రమే “రాయన్”. మరి ధనుష్ దర్శకత్వం విషయంలో చాలా మంది నమ్మకం పెట్టుకొని ఎదురు చూసిన ఈ సినిమా ఎలా ఉందో సమీక్షలో చూద్దాం రండి. క కథలోకి వస్తే.. కార్తవ రాయన్ (ధనుష్) తన ఇద్దరు తమ్ముళ్లు ముత్తు రాయన్ (సందీప్ కిషన్), మాణిక్య రాయన్ (కాళిదాసు జైరాం) లు తన చెల్లెలు పసి పాప దుర్గ (దుషర విజయన్) తో చెన్నై లోని అంజనాపురంకి తమ చిన్న వయసులో జరిగిన షాకింగ్ ఇన్సిడెంట్ తో వచ్చేస్తారు. అలాగే కార్తవ కి తన చెల్లెలు అంటే ఎంతో ప్రేమ తన కోసం ఎంతవరకు అయినా తెగిస్తాడు. మరి అంజపురంలో శేఖర్ (సెల్వ రాఘవన్) చేరదీస్తాడు కానీ తన కష్టార్జితంతోనే కార్తవ తన ఇద్దరు తమ్ముళ్లు, చెల్లెలిని సాకి పెద్ద వాళ్ళని చేస్తాడు. కానీ అక్కడే ఉంటున్న ఇద్దరు లోకల్ డాన్ లు సేతురామన్ (ఎస్ జే సూర్య), దురై (శరవణన్) ల మధ్య పవర్ వార్ జరుగుతూ ఉంటుంది. దీనితో వీరి మధ్యలోకి రాయన్ రావడానికి కలిగిన పరిస్థితులు ఏంటి? తన తమ్ముళ్లే రాయన్ కి ఎలా ఎదురు తిరగాల్సి వస్తుంది? అక్కడ నుంచి కార్తవ ఏం చేస్తాడు? వీరందరిలో అక్కడ క్రైమ్ ని ఆపేందుకు వచ్చిన పోలీస్ (ప్రకాష్ రాజ్) ఏం చేస్తాడు? చివరికి ఏమవుతుంది అనేవి తెలియాలి అంటే ఈ సినిమా చూసి తెలుసుకోవాలి. ఈ సినిమాలో మొదటిగా నటీనటుల పెర్ఫామెన్స్ ల కోసం మాట్లాడినట్టు అయితే ధనుష్ ప్రతి ఒక్క నటీనటుడికి పర్ఫెక్ట్ రోల్స్ ని అందించాడు అని చెప్పాలి. కార్తవ రాయన్ గా తన పాత్ర నుంచి పోలీస్ పాత్రలో కనిపించిన ప్రకాష్ రాజ్ వరకు సాలిడ్ కాస్టింగ్ తీసుకున్నాడు. అయితే ఈ సినిమా కార్తవ రాయన్ గా ధనుష్ మరోసారి తనలోని వెర్సటాలిటీ ప్రదర్శించాడు అని చెప్పాలి. పలు ఎమోషన్స్ కానీ యాక్షన్ సీక్వెన్స్ లు కానీ తన మార్క్ మాస్ తో చేసి చూపించడం బాగుంది. అలాగే యంగ్ హీరో సందీప్ కిషన్ కి ఈ చిత్రంలో మంచి రోల్ దక్కింది. తన పాత్రని సందీప్ చాలా నాచురల్ గా చేసేసాడు. ఇంకా కాళిదాసు జైరాం విక్రమ్ తర్వాత ఈ సినిమాలో డీసెంట్ పెర్ఫామెన్స్ ని ప్రదర్శించడు. అయితే వీరితో పాటుగా తన చెల్లెలి పాత్రలో చేసిన నటి దుషర విజయన్ ఒక సర్ప్రైజింగ్ ప్యాకేజ్ అని చెప్పాలి. ఆమె తన రోల్ లో అదరగొట్టేసింది. ఆమె పై కొన్ని మాస్ సీన్స్ కూడా బాగున్నాయి. ఇంకా విలన్స్ గా కనిపించిన ఎస్ జే సూర్య శరవణన్ లు తమ పాత్రల పరిధి మేరకు ఆకట్టుకుంటారు. ఇంకా నటి అపర్ణ బాలమురళి సందీప్ కి జోడిగా మంచి నటన కనబరిచింది. మెయిన్ గా ధనుష్ దగ్గర బలమైన కథ లేదు. మాస్ లో అందరికీ బాగా తెలిసిన లైన్ తోనే సినిమా మొత్తం నడిపిస్తాడు. దీంతో ఈ సినిమా పట్ల నెక్స్ట్ ఏం జరుగుతుంది అనే ఎగ్జైట్మెంట్ పెద్దగా కనిపించదు. అలాగే చాలా సన్నివేశాలు మనం ఇది వరకే ఎన్నో సినిమాలలో చూసినట్టే అనిపిస్తుంది. మన తెలుగు తమిళ్ లో కూడా పలు సినిమాలు లక్ష్మి, నారప్ప ఒరిజినల్ ధనుష్ సినిమా అసురన్ లాంటివే గుర్తొస్తాయి. వీటితో సినిమా రొటీన్ రెగ్యులర్ మాస్ సినిమా లానే అనిపిస్తుంది. ఇంకా మైండ్ బ్లాక్ చేసే ట్విస్ట్ లు లాంటివి కూడా సినిమాలో లేవు. ఇంకా ఎస్ జే సూర్య, వరలక్ష్మి శరత్ కుమార్ లాంటి నటుల పాత్రలు ఇంకా బలంగా చూపించాల్సింది. ఇలా స్ చిత్రంలో ఆకట్టుకునే అంశాలు ఎన్నైతే ఉన్నాయో ఆకట్టుకోని అంశాలు కూడా అన్నే కనిపిస్తాయి. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు బాగున్నాయి. అలాగే తెలుగు డబ్బింగ్ కేర్ కూడా బాగా తీసుకున్నారు. ఇక టెక్నీకల్ టీం లో రెహమాన్ తన పని చూసుకున్నారు. మంచి సాంగ్స్ కొన్ని సీన్స్ లో సాలిడ్ రీ రికార్డింగ్ తో అదరగొట్టారు. ఇక సినిమాలో సినిమాటోగ్రఫీ ఇంప్రెసివ్ గా ఉంది. ఎడిటింగ్ పర్వాలేదు. ఇక దర్శకుడు ధనుష్ విషయానికి వస్తే.. తను ఈ సినిమాకు నటుడిగా పూర్తి స్థాయి న్యాయం చేశాడు కానీ దర్శకుడుగా మాత్రం ఈసారి తన బెంచ్ మార్క్ సినిమాకి పూర్తి స్థాయి న్యాయం చెయ్యలేదు. రొటీన్ లైన్ నే తీసుకున్నాడు కానీ దానిని మాత్రం అంత బోర్ కొట్టించకుండా హ్యాండిల్ చేయడం మాత్రం బాగానే ఉంది. ఇంకా నటీనటులు ఎంపిక కూడా బాగుం ది కానీ స్క్రీన్ ప్లే ని ఇంకాస్త ఎంగేజింగ్ గా మార్చి ఉంటే బాగుండేది. దీనితో దర్శకునిగా ఈ సినిమాకి తన వర్క్ యావరేజ్ గానే ఉంటుంది. ఇక మొత్తంగా చూసినట్టు అయితే ధనుష్ నుంచి తన స్వీయ దర్శకత్వంలో అది కూడా తన 50వ సినిమాగా వచ్చిన ఈ “రాయన్” సినిమాలో మెప్పించే అంశాలు ఎన్నైతే ఉన్నాయో నొప్పించే అంశాలు కూడా అలానే ఉన్నాయి. కాకపోతే ధనుష్ ఎక్కడా బోర్ కొట్టించకుండా కథనం నడిపించిన విధానం సినిమాని సేఫ్ చేస్తుంది. కొంచెం రొటీన్ లైన్ అయినా పర్వాలేదు ధనుష్ నుంచి ఒక డీసెంట్ మాస్ సినిమా చూడాలి అనుకునేవారు ఈ చిత్రాన్ని ఒక్కసారికి ట్రై చేయవచ్చు.



## డెడ్ పూల్ & వుల్వరిన్ రివ్యూ

ప్రపంచ ప్రఖ్యాత సూపర్ హీరో కామిక్ సంస్థ మార్వెల్ స్టూడియోస్ నుంచి వచ్చిన లేటెస్ట్ అవైటెడ్ సినిమానే “డెడ్ పూల్ & వుల్వరిన్”. మార్వెల్ కామిక్స్ లో మంచి క్రేజ్ ఉన్న రెండు సూపర్ పాత్రలు కలయికలో వస్తుండడంతో దీనిపై ఎప్పుడు నుంచో భారీ హైప్ ఉంది. దీనితో ఈ సాలిడ్ ప్రాజెక్ట్ చూసేందుకు ఇండియన్ ఆడియెన్స్ సైతం ఆసక్తి కనబరిచారు. మరి ఈ చిత్రం ఎంతమేర ఆకట్టుకుందో ఇప్పుడు సమీక్షలో చూద్దాం రండి. ఇక కథలోకి వస్తే.. డెడ్ పూల్ – వేడ్ విల్సన్ (రేయాన్ రెనాల్డ్స్) ఎర్త్ 616 లో ఎవెంజర్స్ తో కలవాలని ఆరాటపడతాడు, కానీ తనకున్న సహజ బుద్ధి మూలాన అందుకు పనికిరాడు అని వారు అతన్ని తప్పిస్తారు. దీనితో తన లైఫ్ లో అప్పటివరకు చేసిన తప్పులు కాకుండా ఒక రియల్ హీరో అనిపించుకోవాలని చూసే కల కలగానే ఉంటుంది అనే సమయంలో టివిఎ(టైం వేరియెన్స్ అథారిటీ) వారు అతన్ని ఎర్త్ 10005 కి తీసుకెళ్తారు. మరి ఈ క్రమంలో డెడ్ పూల్ కి సాయం అవసరం అవుతుంది. అలా తాను వోల్వరైన్ – లోగన్ (హ్యూ జాక్ మాన్) ని కలిసేందుకు సిద్ధం అవుతాడు. మరి అక్కడ నుంచి ఈ ఇద్దరి కలయిక ఎలా జరుగుతుంది? డెడ్ పూల్ కి లోగన్ అవసరం ఎంత ఏమొచ్చింది? లోగన్ లో చనిపోయిన వోల్వరైన్ ఇప్పుడు ఎలా బతికి ఉన్నాడు? మిగతా సినిమాల్లో కూడా కంటిన్యూ అవుతాడా? ఇద్దరు కలిసి చేసే సాహసాలు ఏంటి? వీరి మధ్యలో లోగన్ చెల్లెలు కాసాండ్రా నోవా(ఎమ్మా కోరిన్) పాత్ర ఏంటి లాంటివి తెలియాలి అంటే ఈ చిత్రాన్ని బిగ్ స్క్రీన్స్ పై చూడాల్సిందే. మరి ఈ సినిమాలో మేజర్ ప్లస్ పాయింట్ ఏదన్నా ఉంది అంటే ఆ ఎంటర్టైనింగ్ నరేషన్ అని చెప్పాలి. మొదటి నుంచి ఎండింగ్ వరకు కూడా హిలేరియస్ కామెడీతో కొనసాగే ఎంటర్టైన్మెంట్ సినిమాలో అదిరిపోతుంది. మెయిన్ గా నాన్ స్టాప్ గా సాగే డెడ్ పూల్ రోల్ పై మాటలు, సెటైర్స్, వన్ లైనర్ డైలాగ్ లు ఇంకా మన తెలుగు ఆడియెన్స్ కి బాగా కనెక్ట్ అయ్యే వన్ లైనర్స్ అయితే సినిమాలో క్రేజీ లెవెల్లో నవ్వు తెప్పిస్తాయి అని చెప్పాలి. . లెజెండరీ నటుడు హ్యూ జాక్ మాన్ ని చాలా ఏళ్ల తర్వాత మళ్ళీ వుల్వరరిన్ గా చూడడం అనేది ఫ్యాన్స్ కి మంచి ఎమోషనల్ ట్రీట్ ని అందిస్తుంది. కొన్ని సర్ప్రైజింగ్ పాత్రలు, క్యామియోస్ అబ్బురపరుస్తాయి. ఇంకా క్లైమాక్స్ ఎపిసోడ్ కూడా మంచి హై ని ఆడియెన్స్ లో కలిగిస్తుంది. ఇక సినిమాలో మెయిన్ లీడ్ సహా ఇతర నటీనటులు కూడా అదరగొట్టారు. లేడీ విలన్ ఎమ్మా కోరిన్ తన రోల్ లో సాలిడ్ పెర్ఫామెన్స్ ని కనబరిచింది. అలాగే డిఫ్నే కీన్, రాబ్ డిలానే అలాగే కొందరు వింటేజ్ మార్వెల్ నటీనటులు నటనతో పాటుగా పలు యాక్షన్ సీన్స్ లో అదరగొట్టేసారు. ఈ చిత్రంలో ఎంటర్టైన్ చేసే అంశాలు చాలానే ఉన్నప్పటికీ సరైన ఎమోషన్స్ ఈ సినిమాలో బాగా మిస్ అయ్యాయని చెప్పాలి. ఇద్దరు బిగ్ స్టార్స్ ఉన్నప్పటికీ ఎమోషనల్ బ్యాలన్స్ మిస్ అయ్యినట్టుగా బాగా కనిపిస్తుంది. దీనితో సినిమా నిడివి తక్కువే అయినప్పటికీ అక్కడక్కడా బోర్ గా అనిపించక మానదు. అలాగే ఈ సినిమాలో ఏ రేటెడ్ డైలాగ్స్ కూడా ఎక్కువే ఉన్నాయి సో అందరి ఆడియెన్స్ కొంచెం కంఫర్టబుల్ గా ఫీల్ కాకపోవచ్చు. సో ఇది కూడా దృష్టిలో పెట్టుకోవాలి. కంటెంట్ బాగా ఫాలో అయ్యేవారికి తప్ప మిగతా జెనరల్ ఆడియెన్స్ కి కన్ఫ్యూజన్ గా అనిపించవచ్చు. ఇంకా సినిమాలో కొన్ని చోట్ల విజువల్ ఎఫెక్ట్స్ కూడా మరీ అంత నాచురల్ గా కనిపించవు. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి. ప్రొడక్షన్ డిజైన్, యాక్షన్ బ్లాక్ లు సినిమాలో అదిరిపోయాయి. అలాగే మ్యూజిక్ కూడా చాలా బాగుంది. మెయిన్ గా తెలుగు డబ్బింగ్ మాత్రం అదిరిపోయింది అని చెప్పొచ్చు. ప్రతి పాత్రకి నాచురల్ డబ్బింగ్ లెవెల్లో ప్లాన్ చేశారు. అలాగే తెలుగులో డైలాగ్స్ ని బివి రమణయ్య డైరెక్ట్ చేయగా వీళ్ళి వేణుగోపాల్ రెడ్డి తర్జుమా చేశారు. ఇంకా సాలిడ్ యాక్షన్ సీన్స్, తెలుగులో హిలేరియస్ డైలాగ్స్, ఎంటర్టైనింగ్ నరేషన్, డీసెంట్ ఎమోషనల్ క్లైమాక్స్ ఇంకా కొన్ని సర్ప్రైజ్ లు సినిమాలో ఎగ్జైటింగ్ గా నిలిచాయి. కాక పోతే సినిమాలో కొంచెం ఎమోషనల్ బ్యాలన్స్ మిస్ కావడంతో కొన్ని చోట్ల మాత్రం కొంచెం డల్ గా అనిపిస్తుంది. ఇవి మినహా ఈ సినిమా థియేటర్స్ లో ఎంటర్టైన్ చేస్తుంది.







## లాభాల్లో మార్కెట్లు.. 82,260 పైన సెన్సెక్స్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఆసియా మార్కెట్లలోని సానుకూల సంకేతాలు మన సూచీలకు దన్నుగా నిలుస్తున్నాయి. ఉదయం 9:22 గంటల సమయంలో సెన్సెక్స్ 222 పాయింట్లు లాభపడి 82,262 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 83 పాయింట్లు పెరిగి 24,489 వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.72 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సన్ ఫార్మా, హెచ్‌సీఎల్ టెక్, పవర్ గ్రిడ్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. టెక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, మారుతీ, నెస్లే ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, టైటన్, ఎం అండ్ ఎం, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

## డివైడర్ దాటి బస్సును ఢీకొన్న కారు.. ఇద్దరి మృతి




రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పిన ఓ కారు డివైడర్ దాటి అవతలివైపు మార్గంలో వెళ్తున్న బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. బస్సులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇన్నోవా కారు మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని తుర్కపల్లి, మజ్జీద్‌పూర్ గ్రామాల మధ్య ప్రమాదానికి గురైంది. మృతుల వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనతో ట్రాఫిక్ కిలోమీటరు మేర స్తంభించింది.

## నరమేధం.. 26 మంది హత్య

పపువా న్యూగినియా దేశంలో ఘోరం జరిగింది. అక్కడి మూడు గ్రామాలపై ఓ ముఠా విచక్షణా రహితంగా దాడి చేసి ప్రజలను నరికేసింది. ఈ ఘటనలో 26 మంది మృతి చెందారు. చిన్నారులు, మహిళలు, పురుషుల మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. కొన్ని మృతదేహాలను మొసళ్లు లాక్కెళ్లినట్లు అధికారులు తెలిపారు. ఇళ్లు దహనం చేయడంతో కొందరు బాధితులు పీఎస్‌లో తల దాచుకుంటున్నారు.

## ఆ తేదీల్లో శాతవాహన, గోల్కొండ రైళ్లు రద్దు

వచ్చే నెల 5 నుంచి 10 వరకు గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే (SCR) రద్దుచేసింది. వీటితోపాటు సికింద్రాబాద్-పుణె మధ్య తిరిగే శతాబ్ది సహా పలు రైళ్లను కూడా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. నిర్మాణ, నిర్వహణ పనుల కారణంగా ఈ సర్వీసులను కొన్నిరోజులపాటు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ రైల్వే జోన్ పరిధిలోని దౌండ్ మార్గంతో పాటు దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో మూడో లైను పనుల కారణంగా ప్రయాణికులకు రైళ్ల సేవల్లో అంతరాయం కలగుతుందని పేర్కొన్నారు.



నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

## కార్గిల్ 25వ విజయ్ దివస్..

# యుద్ధ స్మారకం వద్ద మోదీ నివాళులు



భారత భూభాగాన్ని ఆక్రమించాలని ప్రయత్నించిన పాకిస్థాన్ సేనలను తరిమికొట్టిన భారత సైన్యం వీర పరాక్రమానికి ప్రతీక.. కార్గిల్ యుద్ధం.ఆ విజయగాథకు నేటితో సరిగ్గా పాతికేళ్లు. ఈ నేపథ్యంలో నాటి యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాళులర్పించారు. కార్గిల్ 25వ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని కార్గిల్‌లోని ద్రాస్‌లో గల యుద్ధవీరుల స్మారకాన్ని ప్రధాని మోదీ సందర్శించారు. యుద్ధంలో ప్రాణాలర్పించిన వీర సైనికులకు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా అమర జవాన్ల సతీమణులు, కుటుంబసభ్యులతో ప్రధాని కొద్దిసేపు ముచ్చటించారు.

రాష్ట్రపతి నివాళులు..

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఎక్స్ వేదికగా అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. "మన సాయుధ దళాల ధైర్యం, పరాక్రమానికి ప్రతీక విజయగాథ. 1999 నాటి కార్గిల్ యుద్ధంలో మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన ప్రతి జవాన్‌కు నివాళులర్పిస్తున్నా. వారి త్యాగం, శౌర్యం నుంచి దేశ ప్రజలంతా స్ఫూర్తి పొందుతారు. జై హింద్. జై భారత్" అని రాష్ట్రపతి రాసుకొచ్చారు. ఇక, దిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం వద్ద కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమర జవాన్లకు నివాళులర్పించారు. ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అంజలి ఘటించారు. అమరవీరుల త్యాగాలను వృథా కానివ్వబోమని అన్నారు.



పాక్ ఇంకా పాఠాలు నేర్చుకోలేదు: పీఎం మోదీ

కార్గిల్ యుద్ధం ద్వారా పాకిస్థాన్ తన దుర్బుద్ధిని బయటపెట్టుకుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'మన సైనికులకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. భారత్ శాంతికోసం తపిస్తే పాకిస్థాన్ తన నిజస్వభావం బయటపెట్టింది. దుస్సాహసానికి ఒడిగట్టి తగిన మూల్యం చెల్లించుకుంది. ధర్మం ముందు అధర్మం, ఉగ్రవాదం ఓడిపోయాయి. ఆ యుద్ధం సమయంలో సైనికుల మధ్య సామాన్యుడిగా ఉన్నా. వారి పోరాటం నా మదిలో నిలిచిపోయింది' అని పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంలో పాక్‌పై గెలిచి పాతికేళ్లు పూర్తైన సందర్భంగా కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద ప్రధాని మోదీ నివాళులర్పించారు. 'అమరుల త్యాగఫలితంతో ఈరోజు కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకొంటున్నాం. మన జవాన్లు ఎంతో సాహసంతో పోరాడారు. ఉగ్రవాదాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదు. శ్రీనగర్, లద్దాక్‌ను అభివృద్ధి చేసుకుంటున్నాం. టన్నెల్ పూర్తయితే లద్దాక్ మరింత వేగంగా పురోగమిస్తుంది' అని పేర్కొన్నారు.



# నేటి నుంచి ఒలింపిక్స్

## రాత్రి 11.00గం. నుంచి ప్రారంభోత్సవ వేడుకలు

ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు సమయం ఆసన్నమైంది. గతానికి భిన్నంగా ఎలాంటి ఆంక్షలు, నిబంధనలకు తావు లేకుండా స్వేచ్ఛ, స్వాతంత్ర్యానికి ప్రతీకగా పారిస్ విశ్వక్రీడల సంబరానికి వేళయైంది. దశాబ్దం తర్వాత ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిస్తున్న పారిస్..ప్రపంచ క్రీడాకారులకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నది. కరోనా నిబంధలన నడమ జరిగిన టోక్యో(2020)కు పూర్తి భిన్నంగా సీన్ నది తీరాన విశ్వక్రీడల మహోత్సవానికి అట్టహాసంగా తెరలేవనుంది. చారిత్రక ఈఫిల్ టవర్ సాక్షిగా 10,500 మంది ప్లేయర్లు పోటీపడుతున్న ఒలింపిక్స్‌లో ఆరంభ వేడుకలు గతాన్ని తలదన్నే విధంగా చేసేందుకు పారిస్ ప్రభుత్వం నడుము బిగించింది. సుదీర్ఘమైన సీన్ నది పరివాహక ప్రాంతాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుతూ ప్రారంభ కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. వివిధ దేశాల ప్లేయర్లకు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసింది. తమ దేశ ఘనమైన వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెబుతూ సాంస్కృతిక కార్యక్రమాలతో పారిస్ నగరం క్రీడాభిమానులను అలరించనుంది. ఫ్రెంచ్ ప్రముఖ థియేటర్ డైరెక్టర్ థామ్ జాలీ పారిస్ నగరాన్ని ఓపెన్ ఎయిర్ థియేటర్‌గా మారుస్తూ కార్యక్రమాల రూపకల్పన చేశారు.

**16** భారత్ పోటీపడే క్రీడాంశాలు

ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఈక్వెస్ట్రియన్, గోల్ఫ్, హాకీ, జూడో, రోయింగ్, సెయిలింగ్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్.

**32** టోక్యోలో 33 క్రీడాంశాలలో 339 మెడల్ ఈవెంట్స్‌ను నిర్వహించగా పారిస్‌లో 32 క్రీడాంశాలు, 329 ఈవెంట్స్ జరుగుతాయి.

**3** 1900, 1924 తర్వాత సరిగ్గా వందేండ్లకు మళ్లీ ఆ దేశం ఆతిథ్య హక్కులను దక్కించుకుంది.

# బాలుడిని బలిగొన్న టైరు..

అవుటర్ రింగు రోడ్డుపై ఓ బాలుడు మూత్ర విసర్జన చేస్తుండగా ఎక్కడి నుంచో దొర్లుకుంటూ వచ్చిన టైరు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ ఎస్సై సోమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ గ్రామానికి చెందిన సందీప్‌రెడ్డి ఆదివారం రాత్రి ముత్తంగి దాబాలో భోజనం చేసేందుకు కారులో కుటుంబసభ్యులతో బయల్దేరారు. సుల్తాన్‌పూర్ వద్ద ఓఆర్ఆర్ ఎక్కిన కాసేపటికి వారి కుమారుడు మోక్షిత్‌రెడ్డి(6) మూత్రం వస్తోందని చెప్పడంతో కారు పక్కకు ఆపారు. అనంతరం బాలుడు మూత్ర విసర్జన చేస్తుండగా గుర్తుతెలియని వాహనం టైరు వేగంగా దొర్లుకుంటూ వచ్చి అతన్ని తగిలింది. తీవ్ర గాయాలు కావడంతో తల్లిదండ్రులు హుటాహుటిన ముత్తంగిలో ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి నగరంలో మరో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. ఓఆర్ఆర్‌పై ఏదైనా వాహనం టైరు ఊడిపోయి వేగంగా దొర్లుకుంటూ వచ్చి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## మరో 1,000 తగ్గిన

# బంగారం ధర

హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు తులం రేటు

బంగారం ధరలు భారీగా దిగొస్తున్నాయి. గురువారం తులం రేటు మరో రూ.1,000కిపైగా పడిపోయింది. దీంతో 24 క్యారెట్ 10 గ్రాముల విలువ హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు చేరి రూ.69,820గా నమోదైంది. బుధవారంతో చూస్తే రూ.1,040 తగ్గింది. ఇక 22 క్యారెట్ రూ.950 దిగి రూ.64,000గా ఉన్నది. ఢిల్లీ లో మాత్రం రూ.70,650 వద్ద స్థిరపడింది.ఇక్కడ అంతకుముందు రెండు రోజుల్లో రూ.4,000 దిగజారగా.. మొత్తం ఈ మూడు రోజుల్లో రూ.5,000 పతనం కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లలో ధరల క్షీణత, నగల వర్తకులు అమ్మకాల ఒత్తిడికి లోనవడంబులియన్ మార్కెట్‌ను దిగువముఖం పట్టిస్తున్నాయి. మరోవైపు కిలో వెండి ధర కూడా ఢిల్లీలో రూ.3,500 తగ్గి రూ. 84,000గా ఉన్నది. హైదరాబాద్‌లో రూ.84,500 పలుకుతున్నది. బడ్జెట్‌లో బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాలకు కోత పెట్టడంతో.. ఒక్కసారిగా బయ్యర్లు, ఇన్వెస్టర్లు రివర్స్‌గేర్ వేశారు. కాగా, గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు బంగారం 2361 డాలర్లు పలికితే.. వెండి 28.04 డాలర్లుగా నమోదైంది.

# ఢిల్లీలో భారీ వర్షం..

దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షం ముంచెత్తింది. రాజధాని ప్రాంతంలో శుక్రవారం ఉదయం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఢిల్లీలోని నౌరోజీ నగర్, భికాజీ కామా ప్లేస్, శాంతి మార్గం, ఆశ్రమం, ఆనంద్ విహార్, మలై మందిర్ ఏరియా సహా నోయిడాలోని అనేక ప్రాంతాల్లో తెల్లవారుజామున వర్షం కురిసింది. దీంతో నగరం మొత్తం జలమయమైంది. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షం నీరు వచ్చి చేరింది. ప్రధాన రహదారులన్నీ నదులను తలపిస్తున్నాయి. ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా, రాబోయే రెండు గంటల్లో రాజధానిలో భారీ వర్షం పడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. అదేవిధంగా జులై 28వ తేదీ వరకూ రాజధానిని వర్షాలు ముంచెత్తే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక ఈ వర్షం కారణంగా ఢిల్లీలో గాలి నాణ్యత మెరుగైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. ప్రస్తుతం రాజధానిలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 50గా ఉంది.



## ఇందారం వద్ద ఎండిపోయిన

# గోదావరిని పరిశీలించిన కేటీఆర్



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాళేశ్వరం ప్రాజెక్టులను రెండ్రోజులుగా సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోనే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం.. గురువారం సాయంత్రం కరీంనగర్‌లోని లోయర్ మానేరు రిజర్వాయర్‌ను పరిశీలించారు. శుక్రవారం ఉదయం ఎన్టీపీసీ నుంచి కన్నెపల్లికి బయల్దేరిన ఈ బంధం.. మంచిర్యాల జిల్లా ఇందారం వద్ద నీటి ప్రవాహం లేక ఎండిపోయిన గోదావరి నదిని పరిశీలించారు. గోదావరిఖనిలో సింగరేణి క్వాటర్ల కూల్చివేత బాధితులు కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తమ గోడును కేటీఆర్ ముందు చెప్పుకొన్నారు. గోదావరిఖని లక్ష్మినగర్ షాపింగ్ కాంప్లెక్స్ డెవలప్‌మెంట్ అంటూ సింగరేణి క్వాటర్లు కూల్చివేశారని కేటీఆర్ ముందు వాపోయారు. 82 క్వాటర్లకు కరెంటు, నీళ్లు కట్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్‌సింగ్ అరాచక పాలన చేస్తున్నారని కేటీఆర్‌కు కంప్లైంట్ చేశారు. ఏ ప్రజా ప్రతినిధులు ఇలాంటి పనులు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యలను.. ఇబ్బందులను అసెంబ్లీలో వినిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందానికి విన్నపం పెట్టుకున్నారు. బాధితుల విజ్ఞప్తిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. అలాగే అసెంబ్లీలో పోరాడుతామని కేటఆర్ హామీ ఇచ్చారు.



# నభా నటేష్

# హాట్ లుక్స్

సోషల్ మీడియాలో అందాల ఆరబోయడంలో పోటీ పడుతున్నారు నేటితరం హీరోయిన్స్. ఎప్పటికప్పుడు బోల్డ్ లుక్స్ షేర్ చేస్తూ రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలోనే ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్.. తాజాగా షేర్ చేసిన ఫొటోస్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.యమ స్మార్ట్‌గా తన ఒంపుసొంపులు కెమెరా ముందు పెట్టేసింది నభా నటేష్. సరికొత్తగా హాట్ యాంగిల్స్ తో కుర్రకారులో సెగలు పుట్టించింది. దీంతో ఈ ఫొటోస్ చూసి పిచ్చెక్కిపోతోంది కుర్రకారు.నన్ను దోచుకుందువటే మూవీతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నభా నటేష్.. యూత్ ఆడియన్స్ మనసు దోచుకుంది. ఎంట్రీ ఇవ్వడంతోనే అందరి దృష్టిని తనపై పడేలా చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. తనదైన గ్లామర్, యాక్టింగ్ స్కిల్స్ తో వెండితెరపై మాయ చేసింది.ఆ తర్వాత 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో ఓవర్ నైట్ క్రేజ్ కొట్టేసింది నభా నటేష్. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో నభా అందానికి దాసోహం అయింది యూత్ లోకం. దీంతో ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చేసింది నభా. ఇస్మార్ట్ బ్యూటీగా జనం నాలుకపై కదలాడుతోంది.